



పరామర్శిస్తున్న యూనియన్ నాయకులు



ఆమదాలవలస మండలంలో నీటమునిగిన పంట పొలాలు

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో సోమవారం జిల్లాలో పలుచోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. నందిగాం, సంతబొమ్మాళి, ఆమదాలవలస, టెక్కలి, శ్రీకాకుళం ప్రాంతాల్లో కుండపోతగా వర్షం పడింది. ఒడిశాలో కురుస్తున్న వర్షాల ప్రభావంతో వంశధార, నాగావళి నదుల వరదనీటి ప్రవాహం పెరిగింది. వాగులు, వంకలు పొంగిపొర్లాయి. వందలాది ఎకరాల్లో పంట పొలాలు నీటి మునిగాయి. మందస మండలం దున్నూరులో వరద ఉధృతికి నాలుగు పడవలు కొట్టుకుపోయాయి. జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌కు ఫోన్ చేసి తాజా పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అల్పపీడన ప్రభావం, వర్షాలపై కలెక్టర్ అత్యవసర సమీక్ష నిర్వహించి అధికారులను అప్రమత్తం చేశారు.

ముంచెత్తిన వాన

- అల్పపీడన ప్రభావంతో పలుచోట్ల కుండపోత వర్షం
- నందిగాంలో అత్యధికంగా 90.75 మి.మీ వర్షపాతం
- మునిగిన పంట పొలాలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి, యంత్రాంగం

అల్పపీడనం ప్రభావంతో జిల్లాలో పలుచోట్ల ఎడతెరిపిలేని వానలు కురిశాయి. నందిగాంలో అత్యధికంగా 90.75 మి.మీ వర్షపాతం నమోదైంది. సంతబొమ్మాళి మండలంలో 69 మి.మీ వర్షం పడింది. ఆమదాలవలసలో 61.5 మి.మీ, టెక్కలి మండలం రావివలసలో 50.75 మి.మీ వర్షపాతం నమోదైంది. కంచిలిలో అత్యల్పంగా 3 మి.మీ వర్షం పడింది. ఒడిశాలో కురుస్తున్న వర్షాల ప్రభావంతో వంశధార, నాగావళి నదుల వరద ప్రవాహం పెరిగింది.



శ్రీకాకుళం సిటీ : కాలనీలో నిల్వ ఉన్న వర్షపునీరు

వంశధారలో ఇన్‌ఫ్లో 10,357 క్యూసెక్కులు ఉండగా, అంతే పరిమాణంలో కిందికి విడిచిపెడుతున్నారు. శ్రీకాకుళం నగరం పాతవంతెన వద్ద నాగావళి ప్రవాహం 22 వేల క్యూసెక్కులుగా నమోదైంది. సరుబుజ్జిలి మండలం ఇసుకలపాలెం, బుడ్డివలస, తురకపేట, మూల సవలాపురం, సుబ్బపేట, పెద్ద సవలాపురం, సింధువాడ, వీరమల్లిపేట గ్రామాలకు చెందిన సుమారు 75 ఎకరాల్లో తంపర భూములు నీట మునిగాయి. ఆమదాలవలస మండలం తోటాడలో 20 ఎకరాల మేర వరి పంట పొలాలు నీట మునిగాయి.

శ్రీకాకుళం నగరాన్ని ముంచెత్తిన వాన

అల్పపీడన ప్రభావంతో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు శ్రీకాకుళం నగరాన్ని ముంచెత్తాయి. కాలువలు పొంగిపొర్లాయి. ప్రధాన రహదారుల్లోకి సైతం భారీ మురుగు నీరు ప్రవహించింది. లోతట్టు ప్రాంతాల్లోకి భారీ వర్షపు నీరు చేరింది. రైతు బజారు కూడలి, చిన్నబజారు, పెద్ద బరాటం వీధి, మండల వీధి జంక్షన్, పాతబస్టాండ్, లక్ష్మీ థియేటర్ ప్రాంతాల్లో మోకాలు మేర నీరు ప్రవహించింది. ఆర్‌టిసి కాంప్లెక్స్ ప్రాంగణంలోని భారీ వర్షపు నీరు చేరడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆర్‌టిసి కాంప్లెక్స్ ఆవరణను కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పరిశీలించారు. ప్రయాణికులు ఇబ్బందులు పడకుండా తక్షణమే నీటి తొలగింపుకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వర్షాకాలం సందర్భంగా డ్రైనేజీలు శుభ్రపరిచే పనులను నిరంతరం కొనసాగించాలన్నారు. మున్సిపల్ సిబ్బంది మోటార్ల సాయంతో ఆర్‌టిసి కాంప్లెక్స్ ఆవరణలో నిల్వ నీటిని పంప్ చేస్తున్నారు. ప్రధాన కాలువలో పేరుకున్న పూడికను జెసిబిల సహాయంతో తొలగించే పనులు వెంటనే ప్రారంభించారు.

అప్రమత్తమైన అధికార యంత్రాంగం

జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సోమవారం జెడ్‌పి సమావేశ మందిరంలో అత్యవసర సమీక్ష నిర్వహించారు. రోడ్లు, భవనాలు, అగ్నిమాపక, విద్యుత్‌శాఖ అధికారులు పూర్తి అప్రమత్తతతో ఉండాలన్నారు. వర్షాల ప్రభావంతో వంశధార, నాగవళి నదుల్లో వరద పరిస్థితిని ఒడిశా అధికారులతో సమన్వయం చేసుకుని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని నీటిపారుదలశాఖ అధికారులను ఆదేశించారు. వర్షాల దృష్ట్యా వ్యాధుల ముప్పు లేకుండా మందులు సిద్ధంగా ఉంచాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. ఎచ్చెర్ల మండలం తమ్మినాయుడుపేట వద్ద నాగావళి వరద ఉధృతిని అసిస్టెంట్ కలెక్టర్ పృథ్వీరాజ్, ఆర్‌డిఒ సాయిప్రత్యూష పరిశీలించారు. వజ్రపుకొత్తూరు మండలంలోని కొత్తపేట సముద్ర తీరాన్ని మత్స్యశాఖ అధికారులు పరిశీలించారు. మత్స్యకారులకు పలు సూచనలు చేశారు. ఇచ్ఛాపురం మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో నియోజకవర్గ ప్రత్యేక అధికారి, డ్వామా పీడీ బి.సుధాకరరావు సమావేశం నిర్వహించారు. నందిగాం మండలం కవిటి అగ్రహారం వల్లభరాయునిపేట రౌతు పురం రైల్వే అండర్ పాసేజ్‌లోకి భారీగా వరద నీరు చేరింది. దీంతో వల్లభరాయుని పేట నుండి పాత టెక్కలి వెళ్లేందుకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

వర్షాల ప్రభావంపై కేంద్ర మంత్రి ఆరా

జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల దృష్ట్యా జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని కేంద్ర పౌర విమానయాన మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ఆదేశించారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో సోమవారం ఫోన్‌లో మాట్లాడి తాజా పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఆరు గంటలకోసారి తనకు నివేదికలు పంపాలని సూచించారు. ఒడిశాలో కురుస్తున్న వర్షాల నేపథ్యంలో వంశధార, నాగావళిలో వరద ప్రవాహం పెరిగే అవకాశం ఉందని, నదీ పరివాహక గ్రామాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు. వాతావరణశాఖ హెచ్చరికల దృష్ట్యా మత్స్యకారులు సముద్ర వేటకు వెళ్లొద్దని ప్రత్యేకంగా సూచించారు.



శ్రీకాకుళం : పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

కలకలం

- కెజిబివి ప్రిన్సిపాల్ ఆత్మహత్యాయత్నం
- ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో చికిత్స

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

పొందూరు కస్తూరిబాగాంధీ ప్రిన్సిపాల్ ఆర్.సౌమ్య అక్రమ బదిలీ వ్యవహారం మరో మలుపు తిరిగింది. ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ వల్ల తనకు, తన కుటుంబానికి ప్రాణహాని ఉందని కొద్ది రోజులుగా ఆరోపిస్తున్న ఆమె, సోమవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. నగరంలోని తిలక్‌నగర్‌లో గల తన నివాసంలో మోతాదుకు మించి నిద్ర మాత్రలు మింగి అపస్మారక స్థితిలో ఉన్న ఆమెను కుటుంబ సభ్యులు, డ్రైవర్ శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రిలో చేర్పించారు. ప్రస్తుతం అత్యవసర వైద్యం పొందుతున్న ఆమె ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

సమగ్ర శిక్ష ఎపిసి పొందూరు, కంచిలి, గార కెజిబివిల ప్రిన్సిపాల్స్‌ను ఈనెల తొమ్మిదో తేదీన బదిలీ చేశారు. ఇందులో భాగంగా పొందూరు కెజిబివి ప్రిన్సిపాల్‌గా పనిచేసిన సౌమ్యను కంచిలి బదిలీ చేశారు. అక్కడ విధుల్లో చేరని ఆమె మెడికల్ లీవ్ పెట్టుకున్నారు. ఈనేపథ్యంలో కొద్దిరోజులుగా ఆమె ఎమ్మెల్యే కూన రవికుమార్‌పై ఆరోపణలు చేస్తున్నారు. మీటింగ్‌ల పేరుతో రాత్రి 11 గంటల వరకు ఎమ్మెల్యే ఇబ్బంది పెట్టారని తెలిపారు. కెజిబివిలో రాజకీయ జోక్యానికి అవకాశం కల్పించకపోవడం, వేధింపులపై ప్రశ్నించినందుకు తనపై అవినీతి ఆరోపణలు మోపి బదిలీ చేయించారని ఆరోపించారు. అక్రమ బదిలీని రద్దు చేయాలని సమగ్ర శిక్ష కాంట్రాక్టు అండ్ అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్, యుటిఎఫ్, సిఐటియు, దళిత సంఘాలతో సమగ్ర శిక్ష కార్యాలయం ఎదుట ఆందోళన కూడా చేపట్టారు. మరోవైపు ఆమెను టార్గెట్ చేస్తూ టిడిపికి చెందిన మహిళా నాయకులు ప్రెస్‌మీట్‌లు పెట్టారు. ఈ వివాదం కాస్త ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి వెళ్లడంతో ఆయన ఎమ్మెల్యే కూన రవికుమార్‌ను మందలించినట్లు తెలిసింది. ఇంతలోనే సౌమ్య ఆత్మహత్యకు ప్రయత్నించడం చర్చనీయంశంగా మారింది. సామాజిక మాధ్యమాల్లో టిడిపి శ్రేణులు తనపై, తన కుటుంబ సభ్యులపై వ్యక్తిగతంగా దుష్ప్రచారం చేయడాన్ని తట్టుకోలేక మనస్తాపానికి గురై ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు సౌమ్య తెలిపారు.

యూనియన్ నాయకుల పరామర్శ

జిజిహెచ్‌లో చికిత్స పొందుతున్న ప్రిన్సిపాల్ సౌమ్యను కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ బి.మురళి, సిఐటియు జిల్లా కోశాధికారి ఎ.సత్యనారాయణ, టౌన్ కన్వీనర్ ఆర్.ప్రకాశరావు పరామర్శించారు. ఆమె ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఆందోళన చెందొద్దని, అండగా ఉంటామని సౌమ్యకు భరోసానిచ్చారు. అధికార, ప్రతిపక్ష పార్టీలు ప్రిన్సిపల్ అక్రమ బదిలీ సమస్యను పక్కనపెట్టి రాజకీయ లబ్ధి కోసం ఉపయోగించుకోవడం దురదృష్టకరమన్నారు. సమగ్ర శిక్ష ఎపిసి చేసిన తప్పుడు బదిలీల కారణంగా మనస్తాపానికి గురైన ఆమెకు తక్షణమే మెరుగైన వైద్యం అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. బాధితురాలిపై సోషల్ మీడియాలో జరుగుతున్న ట్రోలింగ్‌ను తక్షణమే ఆపాలని, అనుచిత వ్యాఖ్యలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మహిళా ప్రిన్సిపల్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపకుండా రాజకీయాలు చేయడం దిగజారుడు చర్య అని విమర్శించారు. తక్షణమే అక్రమ బదిలీలను రద్దు చేయాలని, ఈ మొత్తం వ్యవహారానికి కారణమైన సమగ్ర శిక్ష ఎపిసిని తక్షణమే విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. లేకుంటే జిల్లాలోని కార్మిక వర్గం పోరాటానికి సిద్ధమవుతుందని హెచ్చరించారు.

వేతన బకాయిలు చెల్లించాలి

'మీకోసం'కు 78 వినతులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

రిమ్స్ సెక్యూరిటీ గార్డులకు బకాయిపడిన వేతనాలు చెల్లించాలని కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ జెసి ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌ను కోరారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ప్రజాపరిష్కార వేదికలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధ్యక్షతన సోమవారం నిర్వహించిన మీకోసంలో వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో 15 ఏళ్లుగా సెక్యూరిటీ గార్డులుగా సేవలందిస్తున్నామని అన్నారు. సకాలంలో వేతనాలు చెల్లించడంలేదని ఆందోళన వ్యక్తం చేశారు. పాత కాంట్రాక్టర్, ఏప్రిల్, మే ఏరియర్స్ చెల్లించలేదని వివరించారు. జూన్ నుంచి కొత్త కాంట్రాక్టర్ బాధ్యతలు తీసుకున్నారని అన్నారు. మరికొద్ది రోజుల్లో మూడునెలలు కావస్తున్నా జీతాలు చెల్లించకపోవడంతో కార్మిక కుటుంబాలు ఆకలి మంటలతో అలమటిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ధరలు ఆకాశానంటుతుంటే అతి తక్కువ వేతనంతో కుటుంబాన్ని నెట్టుకురావడం భారంగా మారుతోందని వాపోయారు. కార్యక్రమంలో సిఐటియు టౌన్ కన్వీనర్ ఆర్.ప్రకాశరావు, యూనియన్ గౌరవాధ్యక్షులు బి.మురళి, అధ్యక్షులు ఎం.సూర్యనారాయణ, ఉపాధ్యక్షులు బి.అప్పన్న, జాయింట్ సెక్రటరీ జె.వెంకటరమణ, సభ్యులు ఎం.హైమారావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్అండ్‌బి అధికారులు రోడ్డు నిర్మాణ డిజైన్‌లోపం వల్ల ఆముదాలవలస మండలం తోటాడలో 150 ఎకరాల్లో పొలాలు మునిగిపోతున్నాయని, చిన్న వర్షం వచ్చినా సమస్య వెంటాడుతుందని రైతులు ఫిర్యాదు చేశారు. హిరమండలంలో కొందరు రోడ్డులు ఆక్రమిస్తున్నారని వెంకటేశ్వరావు ఫిర్యాదు చేశారు. తన దివ్యాంగ పింఛను రద్దు చేశారని నరసన్నపేట మండలం వి.ఎన్.పురానికి చెందిన చెల్లా సరస్వతి ఫిర్యాదు చేసింది. హౌస్‌హోల్డ్ సర్వేలో తప్పుల వల్ల తమ గ్రామంలో చాలా మందికి అన్నదాత సుఖీభవ పథకం వర్తించలేదని వివరించారు. సర్వే సరిచేయాలని ఎచ్చెర్ల మండలం కేశవరావుపేటకు చెందిన మాజీ సర్పంచ్ పొందూరు భీమారావు ఫిర్యాదు చేశారు. నందివాడ ఇంజినీరింగ్ అసిస్టెంట్ సక్రమంగా విధులకు హాజరు కావటం లేదని స్థానిక నాయకుడు గాడు నారాయణరావు ఫిర్యాదు చేశారు. పేరు తప్పు నమోదు వల్ల తల్లికి వందనం పథకం వర్తించలేదని నరసన్నపేటకు చెందిన బరాటం వరలక్ష్మి వినతిపత్రం అందజేసింది.



వినతిపత్రం అందజేస్తున్న ఉద్యోగులు

బిసి సంక్షేమ వసతిగృహం బుడగుట్లపాలెంలో కొనసాతుందని, కొమరివానిపేట మర్చే ప్రయత్నం చేస్తున్నారని సర్పంచ్ అల్లుపల్లి రాంబాబు కోరారు. 70 మంది తమ గ్రామానికి చెందిన విద్యార్థులు వసతిగృహంలో ఉన్నారని చెప్పారు. మందస ఎంపిడిఒ బదిలీ అయిన తనను రిలీవ్ చేయటం లేదని సంతోషి అనే వెటనరీ అసిస్టెంట్ వినతిపత్రం అందజేశారు. ఎక్కువగా ఫిర్యాదులు వికలాంగ పింఛన్లు తొలగింపు, తల్లికి వందనం వర్తింపు సమస్య పరిష్కారం కాకపోవటం, అన్నదాతా సుఖీభవ పథకం వర్తించక పోవటం వంటివి వచ్చాయి. మొత్తం 78 వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో జెడ్‌పి సిఇఒ శ్రీధర్‌రాజా, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు

జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా

ప్రజాశక్తి - శ్రీకాకుళం

జిల్లా కోర్టుల పరిధిలో ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలాన ఒక ప్రకటనలో తెలిపారు. స్టెనోగ్రాఫర్ గ్రేడ్-3, జూనియర్ అసిస్టెంట్, టైపిస్ట్, ఫీల్డ్ అసిస్టెంట్, డ్రైవర్, ప్రాసెస్ సర్వర్, ఆఫీస్ సబార్డినేట్, కాపీయిస్ట్, ఎగ్జామినర్, రికార్డ్ అసిస్టెంట్ తదితర ఉద్యోగాల భర్తీ కోసం ఇప్పటికే కంప్యూటర్ ఆధారిత పరీక్షల షెడ్యూల్ విడుదల చేశామని పేర్కొన్నారు. ఈ నియామక పరీక్షల విషయంలో దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు. నియామక ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా, నిష్పక్షపాతంగా చేపడుతున్నట్లు స్పష్టం చేశారు. ఈనెల 20 నుంచి 24వ తేదీ వరకు నాలుగు పరీక్షా కేంద్రాల్లో కంప్యూటర్ ఆధారిత పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అభ్యర్థులు కేవలం మెరిట్ ఆధారంగానే ఎంపికవుతారని, డబ్బు లేదా సిఫార్సుతో ఉద్యోగాలు సాధ్యం కాదని స్పష్టం చేశారు. కొంతమంది దళారులు తప్పుడు హామీలు ఇస్తూ అభ్యర్థులను మోసం చేసే ప్రయత్నం చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. అలాంటి మోసపూరిత చర్యలకు ఎవరైనా పాల్పడితే ఫిర్యాదు చేయాలని సూచించారు. ప్రభుత్వ ఉద్యోగాలు కష్టపడి చదివిన ప్రతిభావంతులకే దక్కుతాయని, దళారుల మోసపూరిత ప్రయత్నాలకు లోనుకాకుండా అభ్యర్థులు నమ్మకంగా పరీక్షలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ పరీక్షలను జిఎంఆర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ రాజాం, శ్రీ శివానీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ చిలకపాలెం, శ్రీ వెంకటేశ్వర కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఎచ్చెర్ల, కోర్ టెక్నాలజీస్ గొట్టిపల్లి నరసన్నపేట కేంద్రాల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



వికలాంగ పింఛన్ల ఏరివేత

- 'సదరం'లో పర్సంటేజీ తగ్గింపుతో అనర్హత
- సెప్టెంబర్ నుంచి పెన్షన్లు నిలిపివేత
- ఆందోళన చెందుతున్న వికలాంగులు

ప్రజాశక్తి - సంతబొమ్మాళి

టిడిపి కూటమి ప్రభుత్వం పింఛన్‌ను రూ.ఆరు వేలకు పెంచిన ఆనందం వికలాంగులకు మూణ్నాళ్ల ముచ్చటగానే మిగిలింది. చివరకు ఉన్న పింఛన్ పోయే పరిస్థితి వచ్చింది. తప్పుడు పత్రాలతో బోగస్ పెన్షన్లు అందుకుంటున్న వారి ఏరివేత పేరుతో అర్హుల పింఛన్లకూ ప్రభుత్వం ఎసరు పెడుతోంది. వికలాంగత్వాన్ని నిర్ధారించే సదరం పరీక్షల్లో పర్సంటేజీని 40 శాతం కంటే తగ్గించడంతో వారిని పింఛన్లకు అనర్హులను చేస్తోంది. వీరికి వచ్చే నెల నుంచి పింఛన్లను నిలిపివేయనుంది. దీంతో వికలాంగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



వికలాంగుల పెన్షన్లు పొందుతున్న వారిని అధికారులు విడతల వారీగా పున: పరిశీలన చేపట్టారు. వికలాంగ పెన్షన్ తీసుకుంటున్న వారికి ఇటీవలే ప్రభుత్వాసుపత్రుల్లో ఇతర జిల్లాల వైద్యులతో వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్యుల బృందం సమర్పించిన నివేదికల ఆధారంగా వికలాంగత శాతం నిర్ణయించారు. వికలాంగత్వం 40 శాతం కంటే తక్కువ చూపిస్తూ అనర్హులుగా గుర్తించారు. అనర్హుల జాబితాను తయారు చేసి వారికి నోటీసులు అందించే ప్రక్రియ ప్రారంభించారు. దీంతో కొంతమంది అర్హులైనా, 40 శాతం కంటే తక్కువ వికలాంగత్వం సదరం ధ్రువీకరణ పత్రాల్లో రావడంతో వారు పింఛన్లకు నోచుకోని పరిస్థితి నెలకొంది.

జిల్లావ్యాప్తంగా సుమారు 16 వేల మందికి వికలాంగుల పింఛన్ల తొలగింపు ప్రక్రియ ప్రారంభమైంది. సంతబొమ్మాళి మండలంలో 20 సచివాలయాలు, 34 పంచాయతీల పరిధిలో మొత్తం 944 వికలాంగుల పెన్షన్లు ఉన్నాయి. వీటిలో 124 మందికి వైద్య పరీక్షల్లో 40 శాతం కంటే తక్కువ వికలాంగత్వాన్ని గుర్తించి నోటీసులు ఇచ్చారు. అధిక శాతం మంది ఒక కన్ను చూపు కోల్పోయిన వారు, పక్షవాత వ్యాధి బాడిన పడిన వారు అనర్హులుగా గుర్తించడంపై లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. ఎప్పట్నుంచో తాము పెన్షన్లు పొందుతున్నామని, ఇప్పుడు ఎలా అనర్హులవుతామని వాపోతున్నారు

ప్రభుత్వం గుర్తించింది ఇలా...

85 శాతానికి పైగా వికలాంగత్వంతో మంచానికే పరిమితమైన లబ్ధిదారులకు యధావిధిగా హెల్త్ పెన్షన్ రూ.15 వేలు కొనసాగనుంది. 40 నుంచి 85 శాతం మధ్య ఉన్న వారికి వికలాంగుల పెన్షన్ రూ.6 వేలు కేటాయించారు. వికలాంగత్వం 40 శాతం కంటే తక్కువగా ఉండి వయసు 60 ఏళ్లు పైబడిన వారికి వృద్ధాప్య పెన్షన్‌గా మార్పు చేస్తూ రూ.నాలుగు వేలు మంజూరు చేయనున్నట్లు అధికారులు చెప్తున్నారు. 40 శాతం కంటే తక్కువగా ఉండి, 60 ఏళ్లు నిండని లబ్ధిదారుల పెన్షన్లు మాత్రం సెప్టెంబర్ నుంచి నిలిపివేయనున్నారు.

నెల రోజుల్లో అప్పీల్‌కు అవకాశం

పెన్షన్ రద్దయిన వారి వివరాలు ఇప్పటికే సచివాలయ లాగిన్‌లో అందుబాటులో ఉన్నాయని, సంబంధిత నోటీసులను డౌన్‌లోడ్ చేసి లబ్ధిదారులకు అందజేయాలని అధికారులకు ఆదేశాలు వచ్చాయి. ఈ ప్రక్రియను ఈనెల 25వ తేదీ లోపే పూర్తి చేయాలని వారికి సూచనలు అందాయి. అర్హులైన వికలాంగుల పెన్షన్ నిలిపివేతపై సంబంధిత పింఛన్‌దారుడు అప్పీల్ చేసుకునే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. దానికి సంబంధించి లబ్ధిదారుడు తన పాత సదరం సర్టిఫికెట్, నోటీసుతో కలిసి ప్రభుత్వాస్పత్రిలో వెరిఫై చేయించుకుని, కొత్త మాన్యువల్ సర్టిఫికెట్ పొందాలి. ఆ తర్వాత అవసరమైన పత్రాలతో మండలాల్లో అయితే ఎంపిడిఒ, మున్సిపాల్టీలో అయితే మున్సిపల్ కమిషనర్‌కు 30 రోజుల్లోపు అప్పీల్ చేసుకోవచ్చని స్పష్టం చేశారు.

40 శాతం కంటే తగ్గించారు

గతంలో ఇచ్చిన సదరం ధ్రువపత్రంలో 40 శాతం వికలాంగతం ఉంది. గత టిడిపి ప్రభుత్వం నుంచే పింఛను పొందుతున్నాను. ఇటీవల నిర్వహించిన వైద్య పరీక్షలలో కన్ను సమస్య ఉందని చెప్పినా 40 శాతం కంటే తక్కువే వికలాంగత్వం గుర్తించారు. పింఛను పైనే ఆధారపడే కుటుంబం మాది. దయచేసి అధికారులు, నాయకులు చొరవ తీసుకొని మరలా నా పింఛను ఇప్పించాలి.

- వాడరేవు రంగనాథ్, సీతానగరం

కర్మయోగి పాఠాలు రుద్దడం సమంజసం కాదు

ప్రజాశక్తి- నరసన్నపేట

మే నెల నుంచి ఐగాట్ కర్మయోగి యాప్‌లో ఉన్న వీడియో పాఠాలు వీక్షించి తీరాలని ఉపాధ్యాయులపై అధికారులు ఒత్తిడి తేవడం ఏమాత్రం సమంజసం కాదని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు లండ బాబూరావు, ప్రధాన కార్యదర్శి బమ్మిడి శ్రీరామ్మూర్తి అన్నారు. ఈ సందర్భంగా సోమవారం విలేకరులతో మాట్లాడారు. వీడియోలు వీక్షించి ఎస్సెస్మెంట్లను పూర్తి చేసి ధ్రువపత్రాలను డౌన్‌లోడ్ చేయాలని ఒత్తిడి చేస్తున్నారని అన్నారు. మొదట్లో నాలుగు పాఠాలు వినాలని అన్నారని తెలిపారు. మరలా ఇప్పుడు సుమారు 20 పాఠాలు వినాలని కలెక్టరేట్, డిఇఒ, ఎఇఒ కార్యాలయాల నుంచి వ్యక్తిగతంగా సందేశాలు పంపారని తెలిపారు. ఆరు పాఠాలకు మించని ఉపాధ్యాయుల పేర్లు వాట్సాప్‌లో పంపి భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంతవరకు ఒక్క అధికారీ ఐగాట్ కర్మయోగి అంటే ఏమిటి? ఎందుకు ఇందులో వీడియో పాఠాలు వినాలి? అనే దానిపై ఉపాధ్యాయులకు స్పష్టం చేయలేదని చెప్పారు. ఒక్క పాఠం పది నిమిషాలు వినేసరికి 2 జిబి ఇంటర్నెట్ అయిపోతుందని అన్నారు. రోజంతా ఇంటర్నెట్‌పై ఆధారపడి యాప్‌ల్లోనే పనిచేయాల్సిన పరిస్థితి ఉందని పేర్కొన్నారు. ఈ యాప్‌ల్లోనే జీవితాన్ని అంకితం చేస్తూ పనిచేస్తున్న ఉపాధ్యాయులకు పాఠాలు చెప్పే అవకాశం లేకుండా చేస్తున్నారని అన్నారు. ఉపాధ్యాయులకు సమయం, అవకాశం ఉంటే స్వచ్ఛందంగా వింటారు కానీ, బలవంతంగా పాఠాలు వినాలని ఒత్తిడి తేవడం సరికాదన్నారు. దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు.

రైతు దగా ప్రభుత్వం

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

ఉచిత పంటల బీమా ప్రీమియం ప్రభుత్వమే చెల్లించాలని, వంశధార కాలువ ద్వారా టెక్కలి నియోజకవర్గంలోని కాలువ శివారు ప్రాంతాలకు సాగునీరు అందించాలని వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్ కోరారు. స్థానిక అంబేద్కర్ కూడలి నుంచి ఆర్‌డిఒ కార్యాలయం వరకూ సోమవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్‌డిఒ ఎం.కృష్ణమూర్తిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులకు ఎరువులను తక్షణమే అందజేయాలన్నారు. వైసిపి ఐదేళ్లలో రైతాంగానికి ఉచిత పంటల భీమా సౌకర్యం కల్పించిందని గుర్తు చేవారు. టిడిపి కూటమి ప్రభుత్వం పంటల భీమా ప్రీమియంను రైతులే చెల్లించాలని ఆదేశించడం సరికాదన్నారు. కేంద్రం నుంచి రావాల్సిన ఎరువులకు సంబంధించిన సబ్సిడీని చంద్రబాబు ప్రభుత్వం నగదు రూపంలో తీసుకోవడంతో ఎరువుల కొరత ఏర్పడిందన్నారు. దీంతో ఎరువులు లేక రైతుల పరిస్థితి దైయనీయంగ మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు అసమర్థత వల్ల వ్యాపారులు ఎరువులను బ్లాక్ మార్కెట్‌కి తరలిస్తున్నారని ఆరోపించారు. దీంతో రైతులు బ్లాక్ మార్కెట్‌లో రూ.600 కొనుగోలు చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. వ్యాపారులు ఎరువులు కృత్రిమ కొరత సృష్టిస్తున్నా వ్యవసాయ శాఖ అధికారులు కనీసం స్పందించడం లేదని అన్నారు. సహకార సంఘాల ద్వారా ఎరువులు పంపిణీ చేస్తూ టిడిపి కార్యకర్తలకే ఎరువులు అందజేస్తు బ్లాక్ మార్కెట్‌కి తరలిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో నాలుగు మండలాల ఎంపిపిలు, జెడ్‌పిటిసిలు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

ర్యాలీని అడ్డుకునేందుకు యత్నం

ఉదయం 10 గంటలకు టెక్కలి అంబేద్కర్ కూడలి వద్దకు వైసిపి నాయకులు పెద్ద ఎత్తున చేరుకున్నారు. అయితే ర్యాలీకి అనుమతి లేదని ఎస్ఐ తన పోలీస్ సిబ్బంది పెద్ద ఎత్తున చేరుకుని అక్కడికి చేరుకున్నారు. కార్యకర్తలను తరలించేందుకు వాహనాలను సిద్ధం చేశారు. దీంతో వైసిపి కార్యకర్తలు, పోలీసుల మధ్య వివాదం చోటు చేసుకుంది. అనంతరం కార్యకర్తలంతా మూకుమ్మడిగా ర్యాలీగా బయలుదేరారు. పంచాయతీ కార్యాలయం సమీపంలోని రహదారిపై కొద్దిసేపు బైఠాయించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పోలీసులు కలుగజేసుకోవడంతో అక్కడి నుంచి లేచి ర్యాలీగా ఆర్‌డిఒ కార్యాలయానికి వెళ్లారు.



ర్యాలీ నిర్వహిస్తున్న వైసిపి నాయకులు



ఫిర్యాదుదారుల సమస్యలు వింటున్న ఎస్‌పి మహేశ్వర్‌రెడ్డి

ఫిర్యాదులకు సత్వర పరిష్కారం

ఎస్‌పి కె.వి మహేశ్వర్ రెడ్డి

శ్రీకాకుళం సిటీ: పబ్లిక్ గ్రీవెన్స్‌లో స్వీకరిస్తున్న ప్రజా ఫిర్యాదులపై జాప్యం లేకుండా, నిర్లక్ష్యం వహించకుండా త్వరితగతిన ఆయా ఫిర్యాదులపై విచారణ జరిపి అర్జీదారులు సంతృప్తి పొందేలా పూర్తిస్థాయిలో పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని జిల్లా ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదిక కార్యక్రమంలో 47 మంది నుంచి ఫిర్యాదులను స్వీకరించి, వారితో ముఖాముఖి మాట్లాడి, ఫిర్యాదుదారుల సమస్యలను తెలుసుకొని పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. ఫిర్యాదు దారుల అర్జీలు, వారి వివరాలు సంబంధిత పోలీసు అధికారులకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తక్షణమే సంబంధిత పోలీసు అధికారులకు తెలియజేసి చట్టప్రకారం చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. ఎస్‌పి స్వయంగా వృద్ధులు, వికలాంగ అర్జీదారులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఆయా ఫిర్యాదులపై తీసుకున్న చర్యలను నిర్ణీత సమయంలో జిల్లా పోలీస్ కార్యాలయానికి నివేదిక రూపంలో పంపించాలని అధికారులను ఆదేశించారు.



నిరసన తెలియజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కాంగ్రెస్ నాయకుల నిరసన

శ్రీకాకుళం సిటీ: ఏఐసిసి, పిసిసి ఆదేశాల మేరకు సోమవారం రాత్రి జిల్లా కేంద్రంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు డిసిసి నాయకులు ఎన్నికల కమిషన్‌కు వ్యతిరేకంగా నిరసన తెలియ జేశారు. డిసిసి ఉపాధ్యక్షులు కె.వి.ఎల్.ఎస్. ఈశ్వరి సమక్షంలో ఇందిరా విజ్ఞాన్ భవన్ నుంచి మున్సిపల్ ఆఫీస్ గాంధీ విగ్రహం వరకు కొవ్వొత్తుల ర్యాలీ కొనసాగింది. కేంద్రంలో ఉన్న బిజెపి, కూటమి చెప్పు చేతుల్లో ఎలక్షన్ కమిషన్ పనిచేస్తుందని ఆరోపించారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌ఛార్జి గాదం వెంకట త్రినాధరావు, నాయకులు అంబటి కృష్ణారావు, డిసిసి ప్రధాన కార్యదర్శి సాయిందుల్లాఖాన్, అంబటి లక్ష్మణరావు, జిల్లా ఎస్‌సి విభాగం అధ్యక్షులు తెంబూరు మధుసూదనరావు పాల్గొన్నారు.

కామినాయుడు చెరువు గట్టుకు రక్షణ



చెరువు గట్టును పటిష్టపరుస్తున్న వంశధార అధికారులు

సరుబుజ్జిలి: మండలంలోని మూల సవలాపురంలోని కామినాయుడు చెరువు గట్టు బీటలు వారడంతో అధికారులు గట్టు పటిష్టతకు చర్యలు చేపట్టారు. వంశధార ఎఇ కాజావుద్దీన్ సోమవారం చెరువుగట్టు గండి పడకుండా చర్యలు చేపట్టారు. సర్పంచ్ తర్లాడ ఈశ్వరరావు సహకారంతో గండి పడటానికి సిద్ధంగా ఉన్న చెరువు గట్టు ప్రాంతంలో మట్టి మూటలను అడ్డంగా పెట్టి నీటి లీకులను నివారించారు. పూర్తిస్థాయిలో చెరువులోని నీరు ప్రవహించకుండా నిలుపుదల కావడంతో గండిపడే ఆస్కారం లేకపోవడంతో రైతులు ప్రజలు ఆనందాన్ని వ్యక్తం చేశారు.

కాలనీల్లో నిలిచిన నీరు



జగన్నాధనగర్ కాలనీలో నీరు

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

పట్టణంలో రోడ్లపై, కాలనీల్లో నీరు నిలిచిపోతుంది. డ్రైనేజ్ సౌకర్యం లేక పోవటం, వరదనీటి కాల్వలు లేక పోవటంతో నీరు నిలుస్తుంది. మందస్తుగా ఎన్నిసార్లు అధికారుల దృష్టికి సమస్య తీసుకువెళ్లినా సమస్య పరిష్కరించలేదని పట్టణ సంక్షేమ వేదిక కన్వీనర్ ఎం. గోవిందరావు తెలిపారు. డిసిసిబిఇ, జగన్నాధ నగర్, తిలక్‌నగర్, గోవింద నగర్, రామ్ నగర్, కృష్ణానగర్, శ్రీకాకుళం పట్టణంలో విలీన పంచా యతీల్లో ఉన్న కాలనీల్లో నీటినిల్వలు సమస్యగా మారాయి. మరోపక్క కుశాలపురం బైపాస్ నుంచి ఏడురోడ్ల కూడలి వరకు వెళ్లే రోడ్డు, సింహద్వారం నుంచి డే అండ్ నైట్ వెళ్లే రోడ్డు వర్షాలకు పాడైంది. రోడ్డుపై గోతులు కావటంతో వాహన చోదకులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.



డిసిసిబి కాలనీలో నీరు

అల్లరిమూకల అరాచకం

ప్రజాశక్తి- లావేరు

మండల కేంద్రం లావేరు గ్రామ సచివాలయంలో అల్లరి ముకల అరాచకం సృష్టిస్తున్నారు. ఆగస్టు 17 ఆదివారం రాత్రి పది 11 గంటల మధ్య సమయంలో కొంతమంది అల్లరి మూకలు మద్యం తెచ్చుకొని సచివాలయం వద్ద మద్యం సేవించి ఆ పరిసరాల్లో వీరంగం సృష్టించారు. మద్యం, గంజాయి సేవించి మత్తులోకి వెళ్లిన తరువాత వాళ్లు విచక్షణ కోల్పోయి ఏమి చేస్తున్నారో అర్థం కావడం లేదు. పూటుగా తాగి అక్కడే కేకలు, కేరింతలు కొడుతూ న్యూసెన్స్ చేస్తూ స్థానికులను ఇబ్బందులు పెడుతున్నారు. ఆదివారం రాత్రి సచివాలయానికి తాళాలు వేసి వున్నా స్లేడ్ పైకి ఎక్కి అక్కడ నుంచి లోపల మెట్లు మార్గాన లోపలకు ప్రవేసించి సచివాలయంలో ఉన్న బీరువా తలుపులు పగలగొట్టి కంప్యూటర్‌ను చిందరవందరగా చేసి తలుపుల గెడలు లోపల వేసి లోపలంతా అస్తవ్యస్తం చేసి మరలా మెట్లు మార్గం గుండా వెలుపలకు వచ్చి బయట మద్యం, వాటర్ ఖాళీ సీసాలను అక్కడే వేసి, అక్కడే మలమూత్ర విసర్జన చేసి వెళ్లిపోయారు. సోమవారం ఉదయం 10 గంటలకు యధావిధిగా సచివాలయానికి స్వీపర్ వచ్చి తాళాలు తీసి తుడుద్దామని తాళాలు దీయగా లోపల గడియ పెట్టి ఉండడంతో లోపల ఎవరున్నారో, ఏమి జరిగిందోనని సచివాలయ ఉద్యోగులు, స్థానికులు భయాందోళన చెందారు. అనంతరం పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు వచ్చి తలుపులు విరగ్గొట్టి లోపలకు వెళ్లి చూడగా అంతా చిందర వందరగా పడి ఉన్నాయి. ఇక్కడ రోడ్డును అనుకోని కూడలిలో ఉన్న సచివాలయం వద్దనే ఇలా జరిగితే ఇంకా ఇతరులకు రక్షణ ఏ విధంగా వుంటుందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. పోలీస్ అధికారులు స్పందించి అల్లరి మూకల ఆగడాలు, అరచకాన్ని అణిచి వేయకపోతే ప్రజలకు రక్షణ లేకుండా పోతుందని ఆవేదన చెందుతున్నారు. గతంలో లావేరులో ఇటువంటి అరాచకం ఎన్నడూ చూడలేదని, ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



విరగ్గొట్టిన బీరువా తలుపులు



సచివాలయ ఆవరణలో పడేసిన మద్యం, వాటర్ ఖాళీ సీసాలు



లోపల నుంచి గడియ వేసి ఉన్న సచివాలయం

కళింగ కోమటి అధ్యక్షునిగా హరగోపాల్

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ



హరగోపాల్

కళింగ కోమటి సంఘ నగర అధ్యక్షుడుగా కోరాడ హరగోపాల్‌ను సోమవారం సామాజిక తరగతి నాయకులు ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షులు బోయిన గోవిందరాజులు ఈయన పేరును ప్రకటించారు. ఏడాది పాటు ఈయన కొనసాగుతారని, అనంతరం ఏడాది పాటు ఉన్న సర్వేశ్వరరావు కొనసాగుతారని ప్రకటించారు. నగరంలోని కళింగ వైశ్య కల్యాణ మండపంలో సమావేశం నిర్వహించి, చర్చించి ప్రకటన చేశారు. పలువురు సామాజిక తరగతి నాయకులు పాల్గొన్నారు.

30లోగా క్రాప్ ఇన్స్యూరెన్స్ చెల్లించాలి

ప్రజాశక్తి- నరసన్నపేట

నరసన్నపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ పరిధిలోగా రైతులు ఖరీఫ్ సీజన్ 2025 సంవత్సరానికి సంబంధించిన క్రాఫ్ ఇన్స్యూరెన్స్ ఈ నెల 30లోగా చెల్లించాలని సొసైటీ ఛైర్మన్ ఇసా అప్పారావు తెలిపారు. సొసైటీ కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. రైతులు ఇన్స్యూరెన్స్ సకాలంలో చెల్లించకపోతే పంట బీమా ప్రీయం వర్తించదన్నారు. రైతులందరూ 1బి, ఆధార్ కార్డు, బ్యాంకు అకౌంట్, ఫోన్ నంబరు జిరాక్స్ కాపీలతోపాటు క్రాఫ్ ఇన్స్యూరెన్స్ చెల్లించాలని కోరారు. ఈయనతో పాటు సిఇఒ కె.ఈశ్వరరావు ఉన్నారు.

దళితులపై చిన్నచూపు తగదు

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

దళితులపై చిన్నచూపు తగదని దళితజనోర్ధరణ రాష్ట్ర సమితి అధ్యక్షుడు డాక్టర్ కె.వి.రమణ ఒక ప్రకటనలో ఆదేవన వ్యక్తం చేశారు. పొందూరు కెజిబివి ప్రిన్సిపాల్ అక్రమ బదిలీ చేయడంతో ఆమె ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందని అన్నారు. దీనిపై నెలా 20న శ్రీకాకుళం అంబేద్కర్ విజ్ఞాన భవనంలో దళిత నాయకులతో కలిసి రౌండ్‌టేబల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దళితులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

36 అర్జీలు స్వీకరణ

ప్రజాశక్తి- టెక్కలి

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆర్‌డిఒ ఎం.కృష్ణమూర్తి సూచించారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదికలో భాగంగా 36 అర్జీలను స్వీకరించారు. స్వీకరించిన అర్జీల్లో రెవెన్యూ, వ్యవసాయ, పంచాయతీరాజ్, వైద్యశాఖ ఉన్నాయి. కార్యక్రమంలో డివిజన్‌స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేపై తప్పుడు ఆరోపణలు తగవు

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

విద్యా వ్యవస్థ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న ఎమ్మెల్యే కూన రవికుమార్‌పై కెజిబివి ప్రిన్సిపాల్ సౌమ్య తప్పుడు ఆరోపణలతో బురద చల్లడం తగదని కొత్తకోట పిఎసిఎస్ డైరెక్టర్, జనసేన మండల అధ్యక్షుడు పైడి మురళీమోహన్ అన్నారు. సోమవారం తన నివాసం పురుషోత్తపురంలో విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారుస్తూ విద్యా విధానం పటిష్టతకు కృషి చేస్తున్న ఎమ్మెల్యేపై అబండాలు వేసి ఆయన ప్రతిష్టను దిగజార్చాలనుకోవడం మూర్ఖత్వమన్నారు. ఎమ్మెల్యే రవికుమార్ వ్యక్తిత్వం ముక్కుసూటితనమని నియోజకవర్గ ప్రజలందరికీ తెలుసునని అటువంటి వ్యక్తిపై లేనిపోని ఆరోపణలు చేస్తే ప్రజలు హర్షించరన్నారు.

మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా కమలమ్మ

ప్రజాశక్తి- కొత్తూరు



కమలమ్మ

మండల కేంద్రానికి చెందిన చోడవరపు గోవిందరావు భార్య కమలమ్మకు హిరమండలం మండలం మార్కెట్ కమిటీ సభ్యులుగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. డైరెక్టర్‌గా నియామకం చేసినందుకు ఎమ్మెల్యే మామిడి గోవిందరావుకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.



జెసిబితో తొలగిస్తున్న భవన సముదాయాలు

రోడ్డు విస్తరణ పనులు ప్రారంభం

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

మండల కేంద్రం సరుబుజ్జిలిలోని నాలుగు రోడ్ల జంక్షన్‌లో అధికారులు సోమవారం రోడ్డు విస్తరణ పనులు ప్రారంభించారు. అలికాం - బత్తిలి, పాలకొండ - కొమనాపల్లి నాలుగు వైపులా రోడ్లుగా ఉన్న ఈ ప్రాంతంలో గత కొంతకాలం నుంచి రోడ్లు వెడల్పు చేసి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చేయాలన్న రోడ్లు భవనాల శాఖ ప్రతిపాదనలు ఎట్టకేలకు ఆచరణలోకి వచ్చాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఎమ్మెల్యే కూన రవికుమార్ ఈ రోడ్ల విస్తరణ పనులకు సుమారు రూ.12 కోట్లు మంజూరు చేయించారు. ప్రధాన రహదారి ఎబి రోడ్డు, సరుబుజ్జిలి పోలీస్‌స్టేషన్ నుంచి పెట్రోల్ బంక్ వరకు ఉన్న 1500 మీటర్లు, పాలకొండ - కొమనాపల్లి రహదారిలోని 400 మీటర్లు నాలుగు రోడ్లుగా విస్తరించడానికి ఆర్‌అండ్‌బి జెఇ ఆంజనేయులు నాయక్ ఆధ్వర్యంలో పనులు చేపట్టారు. రోడ్డు విస్తరణ పనులు కొందరు వ్యతిరేకించడంతో ఆమదాలవలస సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పి.సత్యనారాయణ, సరుబుజ్జిలి ఎస్ఐ బి.హైమావతి పర్యవేక్షణలో పోలీసు బందోబస్తు నడుమ భవన సముదాయాలను యంత్రాలతో తొలగించారు.

జీతాలు విడుదల చేయాలి

ప్రజాశక్తి- కవిటి

ఆంధ్రప్రదేశ్‌లోని ఒడియా పాఠశాలల్లో పనిచేస్తున్న విద్యా వాలంటీర్ల జీతాలు వెంటనే విడుదల చేస్తూ, ప్రస్తుత విద్యా సంవత్సరానికి కొత్త నియామకాలు చేపట్టాలని ఒడియా లింగ్విస్టిక్ మైనార్టీ సంఘం అధ్యక్షుడు సత్యనారాయణ పాఢీ కోరారు. ఈ మేరకు భువనేశ్వర్‌లో ఒడిశా అసెంబ్లీ స్పీకర్ సురమ పాఢీని సోమవారం కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఒకటి నుంచి 8వ తరగతి వరకు ఒడియా వర్క్‌బుక్స్ అందించాలన్నారు. జాతీయ విద్యా విధానం ప్రకారం హిందీ నేర్చుకునే అవకాశం కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా స్పీకర్ సురమ పాఢీ మాట్లాడుతూ వాలంటీర్ల జీతాల చెల్లింపు, కొత్త నియామకాలు త్వరలోనే చేపడతామని హామీ ఇచ్చారు. సరిహద్దు రాష్ట్రాల్లో చదువుతున్న ఒడియా విద్యార్థుల సమస్యలపై నోడల్ అధికారుల నివేదిక రాగానే ప్రభుత్వం తగిన చర్యలు చేపడుతుందని తెలిపారు. సమావేశంలో డి.ఐ.దుర్గాప్రసాద్ చౌధురీ, రఘునాథగౌడ, భాస్కరపాఢీ, బృందావన దొలాయ్, ఉషాకిరణ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న బృందం

ఉద్దానం వాటర్ ప్రాజెక్టు ఉద్యోగుల నిరసన



నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

ప్రజాశక్తి- పలాస

ఉద్దానం వాటర్ ప్రాజెక్టులో 27 ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్న సిబ్బందిలో కొంత మందిని తొలగించడం అన్యాయమని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు కాశీబుగ్గ మహాత్మాగాంధీ విగ్రహం వద్ద సోమవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ తమకు ముందస్తు ఏ విధమైన సమాచారం ఇవ్వకుండా 132 మంది సిబ్బందిలో 105 మందిని నిర్దాక్షిణ్యంగా మెగా కంపెనీ ఇన్‌ఛార్జి విధుల నుంచి తొలగించారని ఆందోళన వ్యక్తం చేశారు. టిడిపి హయాంలో మాజీ కేంద్రమంత్రి కింజరాపు ఎర్రంనాయుడు తమను విధుల్లోకి తీసుకున్నారని అన్నారు. అదే టిడిపి ప్రభుత్వంలో ఉద్యోగులను అన్యాయంగా తొలగించడం అన్యాయమని అన్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ రూరల్ డ్రీమ్ కింగ్ వాటర్ సప్లయి కాంట్రాక్టర్స్ వర్కర్స్ యూనియన్ నాయకులు కె.నీలాచలం, కె.రాజశేఖర్, బి.జోగారావు, ఎం.వైకుంఠరావు పాల్గొన్నారు.

వీల్‌చైర్ వితరణ

పలాస : పలాస ప్రభుత్వాస్పత్రికి విశ్రాంత ఉపాధ్యాయుడు జయ శంకర్ రోగులకు ఉపయోగపడే వీల్‌చైర్ సోమవారం వితరణగా ఇచ్చారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ తుమ్మినాన పాపినాయుడు, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ మెంబర్ దడియాల నరసింహులు తదితరులు పాల్గొన్నారు.



చైర్‌ను అందజేస్తున్న పాపినాయుడు



మాట్లాడుతున్న ఉపసంచాలకులు శ్రీనివాసరావు

రైతులకు అందుబాటులో ఉండాలి

ప్రజాశక్తి- రణస్థలం

ఖరీఫ్ సాగుకు రైతులు సమాయత్తమవుతున్న నేపథ్యంలో వ్యవసాయ శాఖ అధికారులు, వ్యవసాయ విస్తరణాధికారులు నిత్యం రైతులకు అందుబాటులో ఉండి సలహాలు, సూచనలు అందజేయాలని రణస్థలం వ్యవసాయశాఖ ఉపసంచాలకులు వి.శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. స్థానిక ఎడిఎ కార్యాలయంలో సోమవారం జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ వర్షపాతం నమోదు, సాధారణ పంట సాగు విస్తీర్ణం, ప్రత్యామ్నాయ పంటల సాగు, ఎరువుల లభ్యత, కౌలుదారు హక్కు పత్రాలు, కౌలు రైతులకు పంట రుణాలు పంపిణీ తదితర అంశాలపై చర్చించారు. ముఖ్యంగా రైతులు సాగు చేసిన అన్ని పంటలను ఈ క్రాప్ బుకింగ్‌లో తప్పకుండా నమోదు చేయాలన్నారు. ఈ క్రాప్ నమోదు కోసం ఆధార్, 1 బి, ఆధార్‌తో అనుసంధానించిన బ్యాంక్ ఖాతా వివరాలు, ఫోన్ నెంబర్, సిసిఆర్‌సి కార్డులతో రైతులు వద్దకు వెళ్తే సరిపోతుంది. వెబ్‌ల్యాండ్, సిసిఆర్‌సి (పంటసాగు హక్కు పత్రం) డేటాతో యాప్‌ని అనుసంధానించినందున రైతు ఆధార్ నెంబర్ నమోదు చేయగానే సర్వే నంబర్ల వారీగా భూముల వివరాలు తెలుస్తాయన్నారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో ఏ సర్వే నెంబర్ పరిధిలో ఏ రకం పంటను ఎంత విస్తీర్ణంలో సాగు చేస్తున్నారో యాప్‌లో వివరాలు నమోదు చేయాలన్నారు.

వ్యాను ఢీకొని యువకుడు మృతి

ప్రజాశక్తి- లావేరు



మృతి చెందిన పవన్ కుమార్

మండలంలోని తాళ్లవలస గ్రామం దళితవాడ సమీపంలోని జాతీయ రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు అక్కడికక్కడే మృతిచెందిన ఘటన చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు జలుమూరు మండలం గోటివాడకు చెందిన ముత్తా పవన్ కుమార్ (25) విశాఖపట్నంలో ప్రయివేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. సోమవారం ఉద్యోగ విధి నిర్వహణ నిమిత్తం స్వగ్రామం నుంచి తన ద్విచక్రవాహనంపై శ్రీకాకుళం నుంచి విశాఖపట్నం వెళ్తుండగా తాళ్లవలస సమీపంలో ఉదయం తొమ్మిదిన్నర గంటల సమయంలో అదే రోడ్డులో వెనుకవైపు నుంచి వస్తున్న డిసిఎం వ్యాన్ పవన్ కుమార్ ప్రయాణిస్తున్న దిచక్రవాహనాన్ని బలంగా ఢీకొట్టి కొంత దూరం ఈడ్చుకుంటూ వెళ్లి పోవడంతో పవన్‌కుమార్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. రోడ్డు ప్రమాద విషయం తెలుసుకున్న లావేరు ఎస్ఐ జి.లక్ష్మణరావు సిబ్బందితో వెళ్లి ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతుని కుటుంబ సభ్యులకు సమాచారాన్ని తెలిపారు. మృతుని తండ్రి ముత్తా నర్సింగరావు ఆమదాలవలస రైల్వే డిపార్ట్మెంట్‌లో ఉద్యోగిగా పని చేస్తున్నారు. సమాచారం తెలుసుకున్న వెంటనే ఘటనాస్థలానికి చేరుకున్న తండ్రి నర్సింగరావు, కుటుంబసభ్యులు కన్నీరు మున్నీరుగా రోధించారు. చేతికి అంది వచ్చే కొడుకు ఇలా అర్ధాంతరంగా రోడ్డు ప్రమాదంలో మరణాన్ని తట్టుకోలేక కన్నీరు మున్నీరుగా విలపించారు. మృతదేహానికి శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. ఎఎస్ఐ ముద్దాడ రాజారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సి జోగారావు తెలిపారు.



ప్రమాదానికి గురైన లగేజీ ఆటో

లగేజీ ఆటోను ఢీకొన్న వ్యాను

రణస్థలం జె.ఆర్.పురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని 16వ నంబర్ జాతీయ రహదారి స్టేట్‌బ్యాంక్ ఎదురుగా సోమవారం సాయంత్రం రోడ్డు ప్రమాదం జరిగింది. వివరాల్లోకి వెళ్తే మండలంలోని గొర్లెపేటకు చెందిన నడుపూరి రమణ తన లగేజీ ఆటోతో శ్రీకాకుళం నుంచి రణస్థలం వైపు జాతీయ రహదారిపై నెమ్మదిగా వస్తుండగా శ్రీకాకుళం నుంచి విశాఖపట్నం వైపు వస్తున్న ఐచర్ వ్యాను బలంగా వెనుక నుంచి ఢీకొనడంతో లగేజీ ఆటో నుజ్జునుజ్జయింది. ఢీకొట్టిన ఐచర్ వ్యాను ఆపకుండా పరారయ్యారు. లగేజీ ఆటో డ్రైవర్ రమణ స్వల్ప గాయాలతో బయట పడ్డారు. స్థానికులు డ్రైవర్‌ని స్థానికంగా ఉన్న సూర్య ఆస్పత్రిలో ప్రథమ చికిత్స అందించారు. ఈ రోడ్డు ప్రమాదంపై స్థానిక జె.ఆర్.పురం పోలీస్ స్టేషన్‌లో డ్రైవర్ రమణ ఫిర్యాదు చేశారు.

రణస్థలంలో పారిశుధ్య లోపం

- పెరుగుతున్న దోమల బెడద
- పట్టించుకోని అధికారులు



రోడ్డుపై పేరుకుపోయిన చెత్త

ప్రజాశక్తి- రణస్థలం

మండల కేంద్రంలో పెరుగుతున్న దోమలు ప్రజల ఆరోగ్యంపై పంజా విసురుతున్నాయి. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో పాటు పారిశుధ్య పనులు అంతంత మాత్రంగానే నిర్వహిస్తుండడంతో దోమల బెడద ఇటీవల కాలంలో విపరీతంగా పెరిగింది. ముఖ్యంగా కాలువల్లోని పూడికలు తొలగించకపోవడం, జాతీయ రహదారి విస్తరణ పనులు నిమిత్తం పాత కాలువలు తవ్వి ఇంతవరకూ నూతన కాలువల పనులు జరగకపోవడంతో మురుగు నీరు సర్వీసు రోడ్డుపై పారడంతో దోమలు విపరీతంగా పెరిగిపోయాయి. ఎప్పటికప్పుడు చెత్తను సమయానికి తరలించకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అలాగే ఖాళీ స్థలాల్లో నెలల తరబడి నీరు నిల్వఉండి దుర్గంధం వెదజల్లడంతో పాటు దోమలకు ఆవాసాలుగా మారుతున్నాయి. అయినప్పటికీ ఈ విషయంపై పంచాయతీ అధికారులు దృష్టి పెట్టడం లేదు. వర్షాకాలంలో దోమల వలన మలేరియా, ఫైలేరియా, డెంగీ, టైఫాయిడ్, డయేరియా వంటి వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉన్నాయి. ఇవేవీ పంచాయతీ అధికారులకు పట్టడం లేదు. ఇదే విధానం కొనసాగితే ప్రజలు అనారోగ్యాల బారిన పడే ప్రమాదం ఉంటుంది. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి పారిశుధ్య పనులు సక్రమంగా జరిగేలా చూడాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు.



కాలువలు తవ్వి అస్తవ్యస్తంగా విడిచిపెట్టిన హైవే అధికారులు

ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం

రణస్థలం మండల కేంద్రం జె.ఆర్.పురం పంచాయతీలో పారిశుధ్యం మెరుగుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. ఎంఎల్ ఆయిల్ స్ప్రే చేయించడం, బ్లీచింగ్ చల్లించడం వంటివి చేస్తున్నాం.

- ప్రసాద్, సెక్రటరీ, జె.ఆర్.పురం

పుస్తకావిష్కరణ

టెక్కలి రూరల్ : టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో డేటా సైన్స్ ఆఫ్ కంప్యూటర్ విభాగంలో ఆచార్యులు డాక్టర్ నరేష్ తంగుడు, జయవర్ధనరావు సాహుకారు, ఎస్.కళ్యాణ్, పి.ప్రియాంకలు సంయుక్తంగా 'అల్గోరిత్మ్ ఫర్ ఇంటెలిజెంట్ సిస్టమ్స్' పుస్తకాన్ని రచించారు. దీనిని కళాశాల డైరెక్టర్ వి.వి. నాగేశ్వరరావు సోమవారం ఆవిష్కరించారు. ప్రస్తుత సాంకేతిక రంగంలో ఉన్న అప్లికేషన్స్ నవీకరణ చేయడానికి ఇంజినీరింగ్ విద్యార్థులకు ఇలాంటి రచనలు మరింతగా ఉపయోగపడతాయన్నారు. ఈ రచనా బృందానికి, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్. శ్రీనివాస రావు, బోధన, బోధనేతర సిబ్బంది అభినందించారు.

నిరుపేద కుటుంబానికి ఆర్థికసాయం

శ్రీకాకుళం సిటీ: శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల మండలం ఫరీదుపేట గ్రామానికి చెందిన పుల్లేటికుర్తి మోహనరావు గత కొన్నాళ్లుగా అనారోగ్యంతో బాధపడుతూ నాలుగు రోజుల కిందట మరణించారు. నిరుపేద కుటుంబం కావడంతో ఆయన కుటుంబ సభ్యులకు శ్రీ పైడివారి కుటుంబం ట్రస్టు, శ్రీకాకుళం బిఎస్ఎన్ఎల్ ఉద్యోగులు కలిసి చందాలుగా సేకరించిన రూ.42, 516 మోహనరావు భార్య మణికి ట్రస్టు సభ్యులు సోమవారం అందజేశారు. సహాయం అందుకున్న కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. పైడి చిన్న అప్పలనాయుడు, పైడి రాజ శేఖర్, పైడి మనోజ్‌కుమార్, పైడి నర్సునాయుడు పాల్గొన్నారు.

పాలకవర్గం బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న దామోదరరావు

లావేరు: లావేరు పిఎసిఎస్ నూతన పాలక వర్గాన్ని ప్రభుత్వం ఇటీవల ముగ్గురు సభ్యులతో కూడిన కమిటీని నామినేట్ చేయడంతో సోమవారం మధ్యాహ్నం పిఎసిఎస్ అధ్యక్షుడుగా కూనపల్లి దామోదరరావు బాధ్యతలు స్వీకరించారు. డైరెక్టర్లుగా బుడుమూరుకు చెందిన మాజీ ఎంపిటిసి పండి గోపాలరావు, వెంకటాపురానికి చెందిన ఇప్పిలి శ్రీనువాసరావు బాధ్యతలు చేపట్టారు. నూతన పాలక వర్గంతో సిఇఒ మీసాల సత్యనారాయణ ప్రమాణం చేయించారు. అనంతరం అధ్యక్షునికి కార్యాలయ సిబ్బంది రవిబాబు, పుణ్యవతి, దాలినాయుడు, తమ్మి నాయుడు పుష్పగుచ్ఛంతో శుభాకాంక్షలు తెలిపారు.

సామాజిక మాధ్యమాలపై అవగాహన

నరసన్నపేట: ప్రస్తుతం చదువుతున్న బాలికలు సామాజిక మాధ్యమాలు, సమాజంలో జరుగుతున్న విషయాలపై అవగాహన కలిగి అప్రమత్తంగా ఉండాలని కానిస్టేబుల్ జనార్ధన్ సూచించారు. నరసన్నపేట సోషల్ వెల్ఫేర్ బాలికల వసతిగృహంలో సామాజిక మాధ్యమాలపై సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాలికల తమూ ఉన్న పరిసరాలపై అవగాహన చేసుకోవాలన్నారు. పిసి విజయలక్ష్మి, వార్డెన్ సూర్య కుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థినులకు టిటి ఇంజెక్షన్లు

పోలాకి : పోలాకి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో గంగిలవలసలోని కెజిబివిలో ఇమ్యూనైజేషన్ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. పదో తరగతి విద్యార్థినులకు టిటి ఇంజక్షన్లు వేశారు. ధనుర్వాతం వ్యాధి రాకుండా ఈ వ్యాక్సిన్ ప్రభావంతంగా పనిచేస్తుందని, క్లాస్ట్రీడియం టిటిని క్రిములు శరీరంలో ప్రతి చర్యలు జరపకుండా ఉంటుందని ఆరోగ్య విస్తర్ణాధికారి నల్లి రవికుమార్ తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బి.శారద, మంగం శేఖర్‌బాబు, బరాటం లక్ష్మి, నాగు, పూర్ణ, ట్రైనింగ్ నర్సు సీతారత్నం పాల్గొన్నారు.

ఎం.తోటూరులో కార్డాన్‌సెర్చ్

ఇచ్ఛాపురం : మండలంలోని ఎం.తోటూరులో రూరల్ ఎస్ఐ శ్రీనివాస్ ఆధ్వర్యాన పోలీసులు సోమవారం కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి తనిఖీలు చేశారు. ఈ మేరకు సరైన పత్రాలు లేకుండా ఉన్న 14 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. కొత్తవారు, అనుమానాస్పదస్థితిలో ఉన్న వ్యక్తుల కోసం తనిఖీ చేపట్టామని ఎస్ఐ తెలిపారు.

25న నిరసన

టెక్కలి: ఎంఇఒ తల్లి తులసీరావరెడ్డి వైఖరిని నిరసిస్తూ ఈ నెల 25న మండల విద్యాశాఖ కార్యాలయం ముందు ప్రత్యక్ష చర్యకు సిద్ధమవుతున్నామని టెక్కలి మండల ఉపాధ్యాయ సంఘం నాయకులు తమ్మినేని వైకుంఠరావు, టి.బాబూరావు, వి.ఆదినారాయణ, చిన్నారావు తెలిపారు. ఈ మేరకు ఎంఇఒను సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో అనుచితంగా వ్యవహరిస్తున్న వైఖరిని నిరసిస్తూ ఈ ప్రత్యక్ష చర్యకు పాల్పడుతున్నామని తెలిపారు. సమన్వయ సమావేశాల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చలేదు సరికదా ఉపాధ్యాయులకు ఇబ్బందులకు గురిచేసే చర్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

జెడ్‌పి చైర్‌పర్సన్ పరామర్శ

కవిటి: ఇటీవల మృతి చెందిన పలువురి కుటుంబ సభ్యులను జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ సోమవారం పరామర్శించారు. మండలంలోని బి.జి.పుట్టుగ పంచాయతీ లొట్టిపుట్టుగకు చెందిన లొట్టి నీలయ్య భార్య, బల్లిపుట్టుగకు చెందిన బెందాళం కృష్ణారావు భార్య, జగతికు చెందిన పూడి రాజు ఇటీవల మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న విజయ కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. వారి చిత్రపటాల వద్ద పూలువేసి నివాళ్లర్పించారు. సర్పంచ్‌లు పూడి వరప్రసాద్, బద్రి ప్రకాష్, వైస్ ఎంపిపి పూడి నేతాజీ, బి.కృష్ణారావు, బి. అప్పారావు, ఢిల్లీరావు, వెంకటరావు, బాబూరావు పాల్గొన్నారు.

డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు

రణస్థలం: జిల్లా ఎస్‌పి కె.వి.మహేశ్వర్ రెడ్డి ఆదేశాల మేరకు సిఐ ఎం.అవతారం నేతృత్వంలో సోమవారం ఎస్ఐ ఎస్.చిరంజీవి పోలీస్ సిబ్బందితో పాటు నార్కోటిక్ డాగ్ స్క్వాడ్‌తో జె.ఆర్.పురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని పాన్‌షాపులను ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ప్రతి షాపును తనిఖీ చేసి, అనుమానాస్పద పదార్థాలు స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ తెలిపారు. అక్రమ మాదకద్రవ్యాలు విక్రయిస్తున్న వారిపై కేసులు నమోదు చేసి చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. తనిఖీల్లో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

రణస్థలం రూరల్: మండలంలోని పైడిభీమవరం ఉన్నత పాఠశాలలో 2006 - 2007 సంవత్సరం పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆత్మీయంగా కలిశారు. ఆనాటి తీపి గుర్తులను నెమరు వేసుకుంటూ ఆనందంగా గడిపారు. అప్పటి హెచ్‌ఎం ఎస్.సత్యవతి, అప్పటి సైన్స్ మాస్టారు ప్రస్తుత లావేరు ఎంఇఒ ఎం.మురళీకష్ణ తదితరులు పాల్గొన్నారు.